# ఆశ్చర్యం లేదు!

"నేను ఇంతవరకూ ఎవరినీ ప్రేమించలేదు. అసలు నాకు ప్రేమ అంటే ఏమిటో తెలియదు—"

ప్రభాకర్‌ని చూస్తూ అంది రాణి- ఈ మాటలు రాణి నోట వినటం అది మొదటిసారి కాదు ప్రభాకర్‌కి— ఆ మాటలు విన్నప్పుడల్లా వింతగానే ఉంటుంది అతనికి—

"రాణి ఇంతవరకూ ఏవరినీ ప్రేమించి ఉండకపోతే, అందులో ఆశ్చర్యమేముందీ అంత పని కట్టుకుని చెప్పవలసిందేముందీ!" అనుకుంటాడు తనలో తాను - అయితే ఆ మాటలు పైకి అనే సాహసం లేదు అతనికి—ఆ మాటలేకాదు రాణి మాటలు ఖండిస్తూ ఏ మాటలూ మాట్లాడలేదు అతను- ఎందుకంటే అతడు రాణిని ప్రేమిస్తున్నాడు-పచ్చగా, సన్నగా, పొడుగ్గా, మెరిసే కళ్ళతో. ఆకర్షణీయమైన చిరు

నవ్వుతో తన ఎదురుగా ఉన్న రాణిని చూస్తూ ఆమె మనసు గాయపరిచే సాహసం అతనికిలేదు. కానీ, పరీక్షగా చూస్తే అప్పుడప్పుడు ఆ మెరిసే కళ్ళలో క్రౌర్యరేఖలు కదిలి అతణ్ణి భయపెడతాయి. ఆ చిరునవ్వులో ఆకర్షణతో పాటు ఏదో అపహాస్యమూ తొంగిచూస్తూ ఉంటుంది. రాణిని పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి ఎప్పుడో వచ్చేశాడు ప్రభాకర్, తన నిర్ణయాన్ని బయటపెట్టే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

కిటికీలోంచి బయటకు చూసిన ప్రభాకర్ చూపులు దూరంగా చెట్టుకు ఆనుకుని నిలబడి ఎటో చూస్తున్న స్త్రీ మూర్తిమీద పడ్డాయి. ఆవిడను ఎక్కడో చూసినట్టని పించింది.

"ఎవరా అమ్మాయి?" అని అడిగాడు రాణిని.

రాణి అటు చూడకుండానే "ఎవరో చెడిపోయిన మనిషి! అలాంటివాళ్ళు కాక ఎవరుంటారు. ఇక్కడ?" అంది కంపరంగా.

రాణి రెస్క్యూహోమ్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తోంది. అక్కడి అమ్మాయిలంటే తగని కంపరం రాణికి.

కారణాలు ఏవైతేనేం? కథలు ఎన్ని ఉంటేనేం? వాళ్ళంతా చెడిపోయిన వాళ్ళు- శీలం తగలబెట్టుకున్న వాళ్ళు- తనలా పవిత్రంగా ఉన్న వాళ్ళు కారు? తను కంఠంలో

ప్రాణం ఉండగా అంత హీనంగా - అంత నీచంగా ప్రవర్తిస్తుందా? తన ఖర్మకాలి ఇలాంటి దరిద్రుల మధ్య ఉద్యోగం చెయ్యవలసి వచ్చింది!

"ఆ చెడిపోయిన మనిషికి పేరు లేదా?" అదొక రకంగా నవ్వుతూ అడిగాడు ప్రభాకర్.

"ఏదో ఉంటుంది పేరు! వాళ్ళకి వాళ్ళే తగిలించుకున్న ఒక పాడు పేరు! ఎవరా అమ్మాయి?" అంటూ అప్పుడు బయటికి చూసింది రాణి.

"ఇదా! దీని పేరు అన్వేషిణి!"

"అదేం పేరు?"

"చెప్పానుగా! వాళ్ళకు వాళ్ళే ఇష్టం వచ్చిన పేర్లు పెట్టుకుంటారు. అసలు పేరు దాచి! భలే స్టయిల్‌గా ఉంటాయిలే, వీళ్ళ పేర్లు......"

"కానీ, ఈవిడ పేరు స్టయిలుగా లేదు. వింతగా ఉంది.

"కాస్తో కూస్తో చదువుకుని ఏడిసి నట్టుంది. చదువుకున్నా అన్నీ వెధవ బుద్ధులే."

"ఆ అమ్మాయిని మళ్ళీ పరీక్షగా చూశాడు. ఈ సారి నిజంగానే అన్వేషిణి లాగానే కనపించింది. ఎక్కడో బాగా చూసినట్లే అనిపిస్తోంది. ఎక్కడో గుర్తుకు రావడం లేదు.

"ఏమిటి, అంతగా చూస్తున్నావూ?" చిరాగ్గా అంది రాణి.

"ఏంలేదు ఈ అమ్మాయిని చూసినట్లు అనిపిస్తోంది.

"ఎక్కడో చూసినట్లు అనిపిస్తోందా? కొంప తీసినువ్వు కూడా......" మధ్యలో ఆపి కసుక్కున నవ్వింది రాణి. నిర్ఘాంతపోయి నిలబడ్డాడు ప్రభాకర్. స్నేహం చూపించి నట్లు చూపిస్తూ ఎంతలో తీసి పారెయ్యగలదు రాణి?

ప్రభాకర్ నిర్ఘాంత పోవటం చూసి రాణి సర్దుకుని "దాని లాంటి ఏ అమ్మాయినో ఎక్కడో చూసి ఉంటావులే! మనిషిని పోలిన మనషులుంటారు" అంది.

"నేను వస్తాను–" అని లేచాడు ప్రభాకర్–

ప్రభాకర్ కీ రాణికీ ఏదో దూరపు బంధుత్వం ఉంది.

రాణిని ప్రభాకర్ పెళ్ళి చేసుకుంటే బాగుంటుందనే ఆలోచన ఉభయుల తల్లి దండ్రులకు వచ్చింది.

"ముందుగా తగినంత పరిచయం చేసుకోకుండా పెళ్ళి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. రాణితో పరిచయం చేసుకుని ఒకరినొకరం అర్థం చేసుకున్నాక ఇద్దరికీ ఇష్టమయితే పెళ్ళి ప్రస్తావన తేవచ్చు. అన్నాడు– దీనికికూడా ఉభయుల తల్లి దండ్రులూ ఒప్పుకున్నారు. ప్రభాకర్ తన దగ్గరకు ఎందు కొస్తున్నాడో రాణికి తెలుసు. రాణికి తెలుసునని ప్రభాకర్ కీ తెలుసు. రూపమూ, చదువు, సంస్కారమూ అన్ని ఉన్న

రాణి ప్రభాకర్ మనసును తేలిగ్గానే ఆకర్షించ గలిగింది. పోలీస్ ఆఫీసర్ ఉద్యోగమూ, రూపమూ, మంచిమాటకారి తనమూ వున్న ప్రభాకర్ రాణికి నచ్చాడు - ఇద్దరూ స్పష్టంగా మనసులు విప్పి మాట్లాడుకోవటమే మిగిలింది.

ఆరోజు ప్రభాకర్ వచ్చేసరికి అన్వేషిణి మోకాళ్ళలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తూ కనిపించింది— ప్రభాకర్ ఆశ్చర్యంగా "ఎందు కేడుస్తున్నావ్?" అని అడిగాడు. అన్వేషిణి బెదురుగా చూసి అక్కడి నుండి లేచి పోయింది-

ప్రభాకర్ రాణి దగ్గరికి వెళ్ళేసరికి రాణి ముఖం కోపంతో రాజుకుంటోంది.

"అలా వున్నావేం?" విషయం తెలుసుకోవాలని అడిగాడు ప్రభాకర్,

"రాస్కెల్! దీని బ్రతుక్కి ఎదిరిస్తుందా? దీని అంతు చూస్తాను"

"ఎవరు?"

"అదే! ఆ అన్వేషిణి. దాని నాశనాన్ని అన్వేషించు కుంటోంది అది."

"ఏం జరిగింది?"

"మొన్న ఆ ఏపుడు మొఖంది హుషారుగా కూని రాగాలు తీస్తోంది. "ఏమిటో, భలేహుషారుగా ఉన్నావే! అన్నాను- కులుకుతూ, నవ్వుతూ, తిప్పుకుంటూ "మొన్న

ఫంక్షన్‌లో ఆఫీసర్‌గారు నాపాటని ఎంతో మెచ్చుకున్నారు" అంది. అక్కడితో ఆగలేదు దానిబడాయి. "నా వ్యక్తిగత జీవితంతో నిమిత్తంలేకుండా, అందరినీ ఆనందింపచేసి, నేను ఆనందించగలిగె అమూల్యమయిన వరం నాకు దొరికింది" అంది. దాని బడాయి చూస్తే వొళ్ళుమండినా, దాన్ని మరి కాస్త మునగచెట్టు ఎక్కించాలని "నిజంగా అంత మెచ్చుకున్నారా" అన్నాను. ఆ పిచ్చి మొహంది పొంగిపోయి "నిజంగానండీ! "నిన్ను మా ఇంటికిపిలుచుకొని రోజూ నీ పాట వినాలని ఉంది, అని కూడా అన్నారు" అంది.

"ఇహనేం! నీరొట్టె నేతిలోపడ్డట్టే! ఈ హోంలోంచి బయటపడగానే తిన్నగా ఆ ఆఫీసర్‌గారి దగ్గరికే వెళ్ళు. ఇంట్లో పెట్టుకుని రోజుకొక సన్మానం చేస్తారు" అన్నాను. అప్పటి కర్థమయింది ఆ వెర్రి బాగులదానికి తను వాగుతున్నదేమిటో! ముఖం ముడుమకుని "నేనా ఉద్దేశంతో అనలేదండీ!" అని గునిసింది. సిగ్గా? శరమా? వెధవ బతుకులు! యెప్పుడు ఒకటేబుద్ధి పెంటబుద్ధి."

చీదరింపుగా చూసింది రాణి- ప్రభాకర్ ఆశ్చర్యంగా "అంత మాత్రానికే ఇలా ఏడుస్తుందా? అని అడిగాడు—

"అది కాదులే! తన బండారం బయటపడిందని ఏడుస్తోంది!"

"అదేమిటి?"

"ఆ మధ్య ఆఫీసర్ గారిని ఏదో మీటింగులో కలిసి నపుడు సరదాగా అడిగేశాను. "మా అన్వేషిణి పాటను మీరు మెచ్చుకున్నారటగా! దాన్ని మీ ఇంటికే పిలిపించు కుంటారటగా!" అని. ఆయన బిత్తరపోయి "ఛీ! ఛీ! అదేమి టండీ! ఆవిడని మా ఇంటికి ఎందుకు పిలిపించుకుంటాను?" అన్నారు అక్కడితో దాన్ని పిలిపించి నలుగురి ముందూ నిలబెట్టి "ఏం తల్లీ!" ఆఫీసరు గారు నీ పాటని ఎంత మెచ్చు కున్నారు? ఎప్పుడు పిలిపించుకుంటారు? ఆయన నాకంతా చెప్పారులే!" అన్నాను......

ముఖం మాడిపోయిందిలే! అందరూ ఘొల్లుమని నవ్వారు, అక్కడితో రోషం వచ్చింది కాబోలు అమ్మాయి గారికి!

"ఈ అభాగ్య జీవితంలో ఒకే ఒక్క అందమైన స్మృతిని అపురూపంగా గుండెల్లో దాచుకున్నాను. ఆప్యా యత నటిస్తూ మాట్లాడి నా మనసు తవ్వి తీసి నేలమీదకు విసిరి మురికి పులిమి ఆనందిస్తున్నారు. ఛీ! మీలో ఇంత అల్పత్వం ఉందని ఎన్నడూ అనుకోలేదు. అంది చూశావా, ఎంత పొగరో?"

నివ్వెరపోయాడు ప్రభాకర్.

"తరవాత?"

"రోగ్! రాస్కెల్! దున్నపోతు! ఇదెక్కడ! నేనెక్కడ? నా ముందు నిలబడే తాహతుందా దీనికి! దీని బ్రతుక్కి తోడు నన్నంటుందా! నేను తలుచుకుంటే నిన్నేం చేస్తానో తెలుసా? అప్పుడే ఆఫీసర్‌గారి మేడమ్ అయిపోయానని మురిసిపోకు!" అని గట్టిగా అదలించాను. అమ్మాయిలంతా "ఆఫీసర్‌గారి మేడమ్!" అని చప్పట్లు కొట్టారు. మా బాగా అయింది. అందుకే ఏడుస్తోంది ఆఫీసర్‌గారి మేడమ్ పదవి పోయిందని......"

పకపక నవ్వింది రాణి!

అక్కడ ఉండలేక రాణి నవ్వును వినలేక వచ్చేశాడు. అన్వేషిణిని ఎక్కడ చూసి వుంటానా అని తీవ్రంగా ఆలోచించగా ఆలోచించగా గుర్తు వచ్చింది.

అవును! తన ఫ్రెండ్ కుమార్ చూపించాడు అన్వేషిణిని. ప్రత్యక్షంగాకాదు! ఫోటోలో. ఆ ఫోటో తనకు చూపించి ప్రభూ! ఇదిగోరా నా చెల్లెలు! బంగారు తల్లి తెలుసా! చిన్నప్పటినుండి చదువులో ఫస్టు, ఆటలలో ఫస్టు. ఎంతో బాగా పాడుతుంది! ఇంట్లో అందరికీ అదంటే ప్రాణం. అలాంటిది, నిష్కారణంగా ఇంట్లోంచి వెళ్ళి పోయింది. ఎవరినో ప్రేమించి పెళ్ళి చేసుకుంటానందట! నాన్నగారు వద్దన్నారట! అతనితో వెళ్ళిపోయింది. ఆ తరు వాత ఎక్కడుందో ఏమై పోయిందో, యెవరికీ తెలియలేదు. అది యెక్కడ కనపించినా, ఏ పరిస్థితుల్లో కనిపించినా, నా

గుండెల్లో దాచుకుంటాను. "అన్నయ్యా!" అని అది ఆపేక్షగా పిలిస్తేచాలు. నా చిరాకులన్నీ మాయమయిపోయేవి! ప్రభూ! అది యెక్కడో ఒకచోట సుఖంగానే ఉంటుంది కదూ!" అన్నాడు ఆర్తితో...

ఆనాడు కుమార్ ని ఓదార్చాలని "ఫరవాలేదు—మీ చెల్లెలు సుఖంగానే ఉంటుంది బాధపడకు!" అన్నాడతను.

అన్వేషిణి తన స్నేహితుడు కుమార్ చెల్లెలని స్ఫురించిన తర్వాత అన్వేషిణితో ఒకసారి మాట్లాడాలనిపించింది ప్రభాకర్ కి- కుమార్ తన చెల్లెలిని గురించి యెన్నెన్నో చెప్పేవాడు- ఈ అన్వేషిణి ఆ కుమార్ చెల్లెలేనా?

"నేనొకసారి అన్వేషిణితో మాట్లాడాలి!" అన్నాడు రాణితో.

రాణి తెల్లబోయి కోపంగా 'ఎందుకు' అంది.

"నేను ఆ అమ్మాయిని ఎక్కడ చూశానో స్ఫురించింది. అవునో, కాదో తేల్చుకోవాలి!"

"ఎక్కడ చూశావు?"

"ఆవిడతో మాట్లాడాక కానీ, చెప్పలేను."

ప్రభాకర్ మాట కాదనలేక కొంత, ప్రభాకర్ అన్వేషిణిని ఎక్కడచూశాడో తెలుసుకోవాలనే కుతూహలంతో కొంత అన్వేషిణిని పిలిపించింది.

"ఈ అయ్యగారు నీతో మాట్లాడతారట! లేనిపోని గిరకు పోక తిన్నగా సమాధానం చెప్పు" పురుగును విదిలిస్తున్నట్టుగా అంది.

"కూచోండి! అని కుర్చీ చూపించాడు ప్రభాకర్.

అదిరిపడింది అన్వేషిణి. ఆ సంబోధనకు— దీర్ఘంగా క్షణకాలం ప్రభాకర్ ముఖంలోకి చూసింది. అత్యంత సహజంగా కుర్చీలో కూర్చుంది. రాణి కనుబొమలు ముడుచుకున్నాయి. ఆ ముఖం నిప్పులు చెరిగింది.

"మీవాళ్ళు ఎక్కడున్నారో మీకు తెలుసా?" సంభాషణ ప్రారంభించాడు ప్రభాకర్ సౌమ్యధోరణిలో.

"నావాళ్ళంటూ నేను ఎవ్వరినీ చెప్పుకోవాలనుకోవటంలేదు."

"ఎందుకని? వాళ్ళు మిమ్మల్ని రానివ్వరా?"

"కాదు—రానిస్తారు. ముఖ్యంగా మా అన్నయ్య ఏం చేసినా నన్ను క్షమిస్తాడు కానీ ఈ పరిస్థితుల్లో నన్నుచూసి వాళ్ళు క్షోభపడతారు- నా కారణంగా మిగిలిన వాళ్ళంతా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. అదంతా భరించలేను."

"మరి, ఇకముందు సంఘంలో ఒంటరిగా బ్రతికాలంటే మాత్రం ఇబ్బందులు రావా?"

"ఎందుకు రావూ? వస్తాయి, చేతులారా చేసుకున్నందుకు అనుభవిస్తాను."

"ఇదంతా మీరు చేతులారా చేసుకున్నదేనా? ఇతరులు మీకు చేసిన అన్యాయం ఏమీలేదా?"

"సముద్రంలోకి దూకాక అందులో తిమింగిలాలు, సొరచేపలు, విషసర్పాలు ఎన్నయినా ఉంటాయి- కానీ, అమాయకత్వం అయితేనేం? ఆకర్షణ అయితేనేం? మొదట దూకిన దాన్ని నేనే కదా!"

"చేసిన దానికి పశ్చాత్తాప పడుతున్నారా?"

"ఏ ఆకర్షణతో నేనీ విషసముద్రంలోకి దూకానో. ఆ ఆకర్షణకు అర్థం ఏమిటని ఆలోచిస్తున్నాను."

"అంటే? ఇకముందు ఇలాంటి ఆకర్షణలకు లొంగకుండా ఉండగలరా?"

"చెప్పలేను."

ఉలిక్కిపడ్డాడు ప్రభాకర్. ఆవిడ ముఖంలోకి వింతగా చూస్తూ "ఇంకా ఈ బలహీనత మీలో ఉందా?" అన్నాడు.

"బలహీనత అంటారా? 'నా' అనుకోగలిగే వ్యక్తిని నిండు మనసుతో సేవిస్తూ ఆ ఆశ్రయంలో సేదతీరాలనే ఆశ నా కిప్పటికీ వుంది."

"అంటే? మిమ్మల్ని ఎవరైనా పెళ్ళిచేసుకోవటానికి సిద్ధపడితే చేసుకుంటారా?"

"చేసుకోను! ఎలాగో ఒకలాగ సంసారం చెయ్యాలని తాపత్రయ పడిపోవటం లేదు నేను! లోకంలో ఇంత మంది జనం దేనివెంట పరుగులు పెడుతున్నారు? ఇదంతా ఆనంద మేనా? ఎదుటి వ్యక్తుల్ని క్షోభపెట్టి హీనపరచి హింసించి, అవమానించి, పొందే ఆనందం ఎలాంటిది? అలాంటి ఆనం దానికి అర్రులు చాచే మనుష్యుల మనసులు ఏ కారణాల వల్ల అలా వికృతమవుతున్నాయి? మనసును ఉదాత్తంగా నిలుపుకున్నపుడే, నిజమయిన ఆనందాన్ని అనుభవించగల మని అందరికీ తెలుసునే? మరి ఎందుకు ఉండలేక పోతున్నాం? ఆనందంకోసం ఇంతగా వెంపరలాడుతూ అసలైన ఆనం దాన్ని చేజేతులా ఎందుకు దూరం చేసుకుంటున్నాం? ఇది అర్థంచేసుకోవటానికే నా అన్వేషణ."

ఈ మాటలు విన్న రాణి వుడికిపోయింది.

"రాణిని- సారీ!- రాణిగారిని ఎదిరించినందుకు పశ్చా త్తాప పడుతున్నారా?"

"లేదు!"

"లేదూ?"

"నేను అనవసరంగా ఎవరినైనా నొప్పిస్తే పశ్చాత్తాప పడతాను. పరిహారంగా ఏం చెయ్యటానికైనా సిద్ధపడతాను.

నా వల్ల అపరాధం వున్నప్పుడు నా తల వంగిపోతుంది. ఎదుటి వ్యక్తుల్లో మంచితనానికి లొంగినట్లుగా కపటానికీ, వంచనకూ భయపడను నేను. ధైర్యంగా ఎదుర్కొగలను."

"మీరింక వెళ్ళొచ్చును—"

లేచి రాణికీ, ప్రభాకర్‌కీ కూడా నమస్కారాలు చేసి వెళ్ళిపోయింది అన్వేషిణి—

"ఎలాటిదో చూశావా? ఇప్పుడు అర్థమయిందా?"

"అర్థమయింది!" ఏదో ఆలోచిస్తూ అన్నాడు ప్రభాకర్—

"ఇంతకూ ఎవరా అమ్మాయి? ఎక్కడ చూశావు?"

"నా స్నేహితుడి చెల్లెలు. ఫొటోలో చూశాను."

"స్నేహితుడి చెల్లెలా? ఎలా వచ్చింది ఇక్కడికి?"

"స్నేహితుడి చెల్లెలని తెలిసింది చాలు! మిగిలినవి తెలియక పోయినా పరవాలేదు."

ప్రభాకర్ వెళ్ళాక అన్వేషిణిని పిలిపించి విరుచుకు పడింది రాణి—

"ఏమిటే నీ బోడి గొప్ప? నన్ను ఎదిరిస్తావా? ఏ ధైర్యంతో?"

"మీరిచ్చిన ధైర్యంతోనే!"

"ఏమిటి?"

"మీరు అల్పత్వాన్ని చూపించారు. నేను ఔన్న త్యాన్నే ప్రదర్శిస్తున్నాను. నేనే మీకంటె గొప్పకదా!"

'నోర్ముయ్! బజారు మనిషివి. నీకు ఔన్నత్యమా?'

"మీరు నిన్నంతా నాకు తిండి పెట్టకుండా మాడ్చి మీ కసి తీర్చుకున్నారు. మీ కాబోయే భర్త ప్రభాకర్ గారు. ఆదరంగా నా కష్టసుఖా లడుగు తున్నప్పుడు ఈ విష యము చెప్పి ఆయన దృష్టిలో మీ ఇమేజ్ పాడు చెయ్యా టానికి ప్రయత్నించవచ్చు. కానీ, అలాంటి ప్రయత్నం చెయ్యలేదు నేను! ఒక అల్ప విషయంతో నన్ను అవమా నించారు మీరు! మిమ్మల్ని అవమానించగలిగే అవకాశం నాకు ఉన్నా, ఉపయోగించుకోలేదు నేను! చెప్పండి, ఎవరు గొప్ప!

రాణి మండిపోయింది. తన ఎదురుగా నిలబడ్డ ఆ వ్యక్తి పీక నొక్కి, కళ్ళు పీకి, ముక్కలుముక్కలుగా నరకా లన్నంత కసి కలిగింది.

"నువ్వు...... నా ఎదుట నిలబడి ఇలా వాగుతావా? రేపే నిన్ను హోమ్‌లోంచి డిస్మిస్ చేసేస్తాను. ప్రభాకర్‌తో చెపుతావా నన్ను గురించి? ఏదో పలకరించాడని ఇక నీతో ప్రేమ కలాపాలు సాగిస్తాడని అనుకున్నావా? నీ ముఖమైనా చూస్తాడా, ప్రభాకర్! గెటౌట్!"

అన్నట్లుగానే అన్వేషిణిని హోమ్‌లోంచి డిస్మిస్ చేసే

సింది రాణి. ఒక్క మాట మాట్లాడకుండా, ఏ విధమయిన గొడవా లేకుండా తన సామాను సర్దుకుని బయలుదేరింది అన్వేషిణి. అదే సమయానికి అక్కడికి వచ్చిన ప్రభాకర్ ఎవరినీ, యేమీ అడక్కుండానే పరిస్థితి అర్థం చేసుకుని అన్వేషిణి దగ్గరకు వచ్చి "ఎక్కడకు వెళ్దామనుకుంటున్నారు?" అన్నాడు.

"ఏమో! ఇంత లోకంలో బ్రతక లేనంటారా? బ్రతక లేకపోతే, చచ్చిపోతాను! అంతేగా!

"మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాను.

అందరూ అదిరి పడ్డారు. అప్పుడే అందరూ ఈర్ష్యగా చూశారు.

అన్వేషిణి తల అడ్డంగా తిప్పుతూ నవ్వింది.

"మీకు నా మీద దయ వుంటే నాకేదయినా పని చూపించండి, పెళ్ళి చేసుకోను—

ఈ సారి నివ్వెర పోవటం ప్రభాకర్ వంతు అయింది.

"నన్ను పెళ్ళి చేసుకోరా?" అప్రయత్నంగా ఆశ్చర్యంగా అన్నాడు.

"నేను పరమ నికృష్టురాలిని. మీరు పెళ్ళి చేసుకుంటాననగానే నా అదృష్టానికి పొంగిపోతూ ఎగిరి గంతేసి ఒప్పు

కుంటాను. అంతే కదూ! నా ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా విధినన్ను ఆడిస్తే నేను ఏం చెయ్యలేనుకాని, నాకు సాధ్యమయినంత వరకూ నేను మనసారా గౌరవించి పూజించే పురుషుడితో తప్ప జీవించలేను."

"అయామ్ సారీ! నేను మీకు పని చూపించగలను. ఒక్క నిముషం ఆగండి, రాణితో చెప్పివస్తాను.

రాణికి అప్పుడే ప్రభాకర్ అన్వేషిణిని చేసుకుంటాడన్న వార్త అందిపోయింది. ప్రభాకర్ ని చూడగానే "ఛా! చివరకు బజారుమనిషిని చేసుకుంటున్నావా? ఏ స్థితికి దిగజారావ్?" అంది చీదరింపుగా.

ప్రభాకర్ రాణి మాటలను ఖండించలేదు—నవ్వుతూ.

"ఎప్పుడో ఏదో ఒక పొరపాటు చేసినంత మాత్రాన ఆ వ్యక్తులు నా దృష్టిలో అల్పులుకారు రాణీ. అన్వేషిణి అనేక విధాల నాకెంతో నచ్చింది. ఆ అమ్మాయిని నాతో తీసుకుపోతున్నాను."

"అంతే! కనకపు సింహాసనమున శునకము కూర్చుండ బెట్టి......"

రాణి మాటలు పూర్తి కాకుండానే గట్టిగా నవ్వాడు ప్రభాకర్.

"కరెక్ట్! నువ్వు అమర్చిన కనకపు సింహాసనంకోసం ప్రాకులాడి శునకాన్ని కాదలచుకోలేదు. మంచి మనసుతో మనిషిగా నిలిచిపోవాలని ఉంది. ఇవాళ విడిపోబోయే ముందు నీతో ఒక మాట చెప్పాలని ఉంది. నువ్వు ఒకటికి పదిసార్లు 'నేను ఇంతవరకూ ఎవరినీ ప్రేమించలేదు' అంటుంటే నాకు గమ్మత్తుగా ఉండేది. ఇప్పుడనిపిస్తోంది అందులో ఆశ్చర్యం ఏమీలేదని నువ్వు ఏ ఉద్దేశ్యంతో అన్నా, 'అసలు నాకు ప్రేమ అంటే యేమిటో తెలియదు' అనే నీ మాటలు అక్షరాలా నిజాలు— "గుడ్ బై—"

ఆటోని పిలిపించి అందులో అన్వేషిణిని కూచోబెట్టి తను స్కూటర్ మీద ఫాలో అయ్యాడు ప్రభాకర్.